# 28. కాగితం మనిషి

బాబ్జీ

నున్నటి తారురోడ్డు ఎండకు తళ తళ మెరుస్తూ ముందుకు ముందుకు అంది. ఆతృతతో ముందుకు నడుస్తున్నాడతడు. ఆలోచిస్తూ తనలో తాను ఏదో గొణుక్కుంటూ, బాగా పెరిగిన పీచుగడ్డాన్ని తడుముకుంటూ ముందుకు పోతున్నాడు. బాగా ఎదిగి సంస్కారంలేని చింపిరి జుత్తు ముఖం మీద పడుతున్నది. వెనక్కు తోయాలనే శ్రద్ధ లేదు. మాసి చిరుగులు పట్టిన బట్టలు విశ్వాసంగల సేవకుడిలా అతన్ని అంటిపెట్టుకొని వున్నాయి. అరిగి తరిగి ఆకారాన్ని పోగొట్టుకున్న జోళ్ళు కాళ్ళకు వేలాడుతున్నాయి. చెమట ఓడుతున్న శరీరం. ఎముకలగూడు బరువుగా నిట్టూర్పులు విడుస్తున్నది. కళ్ళనిండా కాంక్షల మెరుపు. చేతిలో చిరుగులు పట్టిన పాత సంచి. సంచిలోనే చిరుగులు పట్టిన జీవితం. పుట్టలు పుట్టలుగా చెదలుపట్టిన జీవితపు పుటలు.

"ఎక్కడికీ ప్రయాణం?"

తనకు తాను వేసుకొన్న ప్రశ్న పెరిగి పెద్దదై ఎదురుగా నిలిచింది. సమాధానం చెప్పుకోలేదు. తనకున్నవన్నీ సమాధానం దొరకని ప్రశ్నలు, ముందుకు నడుస్తూనే వున్నాడు. రోడ్డుమీద జనం... గోల... ఉత్సాహం... ప్రపంచమంతా ఆనందంగా వుంది. తను తప్ప... చేత్తో చెమట తుడుచుకున్నాడు.

"సైడు సైడు" వెనకనుండి రిక్షా దూసుకుపోయింది.

జీవితంలో దారీ, తెన్నూ, గమ్యం ఏవీ ఎరక్కుండా తన కిష్టం వచ్చినట్టు నడిచేస్తున్నాడు. ఎవరో బలవంతాన నడిపిస్తున్నట్టు అనుమానం. రోడ్డు ప్రక్క చెట్టు కింద చిలకజోస్యుడు. పంజరంలో రెక్కలు కత్తిరించిన చిలుకలు. మమతలు, మానవత్వాలు, అనురాగాలు, ఆత్మీయతలు... వాటి తాలూకు అర్థంకాని ఆత్మతృప్తి... తన రెక్కలు

కత్తిరించాయి. వాటిలాగే తనూ పంజరం విడిచిపోలేదు.

"ఎందుకో ఈ ప్రయాస?"

ఒక్కసారి నడక ఆపి తనను తాను మళ్ళీ ప్రశ్నించుకొన్నాడు. జవాబులు చాలా వున్నాయి.

"ఇది ఎన్నోసారి ప్రశ్నించుకోవటం"

ప్రశ్నమీద ప్రశ్న. జవాబు చెప్పటానికి... రాయటానికి టయిమ్ వుంది. వార్నింగ్ బెల్ అయ్యేలోగా ముడి బిగించాలి. మెదడు ఖాళీగా వుంటే, అంతకు ముందే బిగించెయ్యొచ్చు తాడు. ఊపిరి తీసుకోవచ్చు...

"నువ్వెవరు?"

ఈ సారి ఇంకో క్రొత్త ప్రశ్న.

"ఇంకా టయిమ్ వుంది, జవాబు రాయి" మెదడు సమాధానం.

"తలతిక్క ఎక్కువైనట్టుంది నీకు"

"అవును ఆలోచనలతో నిద్రపట్టక"

--అతన్నుండి సమాధానం.

"ఇంతకూ నువ్వెవరు?" మళ్ళీ రెట్టించింది. ఆలోచన ఆపలేని బుర్ర.

"ఏమో?"

"నీకు నిజంగా తెలీదా పాపం" జాలి పడుతూ అడిగింది.

"సిరిబెలమ్ ను అడుగు."

"దానికి తెలీదు. నువ్వే చెప్పు... అది నిద్ర మాలోకం"

"ఏయ్ నిన్నే. బతకాలని లేదురా బేవకూఫ్" లారీ డ్రైవర్ తిడుతూ ముందుకు పోయాడు. తను అందరికీ లోకువ. అసలు అడ్డం పడ్డం తన తప్పు. తప్పు తనది కాదు. లోపలి వాడికి బుద్ధి లేదు. వెధవ ప్రశ్నలతో తెగవిసిగిస్తున్నాడు. మామూలు ధోరణిలో ముందుకు నడుస్తున్నాడు.

"పాపం నువ్వు పుట్టిన రోజునుంచీ అందరికీ లోకువే" జాలి ఒలకబోస్తూ అంది బుర్రకాయ.

"నోర్ముయ్. తంతాను" అన్నాడు.

"నీ మెదడు పూర్తిగా మొద్దుబారి నట్టుంది. ఇక తొందరలోనే..."

"అంతమాట అనకు. నేనింకా సరీగానే వున్నాను."

"అయితే సమాధానం చెప్పు!"

దూరంగా చర్చిలో గంటలు. "ఎవరో అదృష్టవంతుడు ఈ లోకంతో తెగతెంపులు చేసుకొన్నాడనుకుంటా" అనుకున్నాడు. హోరుమంటున్న హారన్లు. ఫుట్‌పాత్ మీదకు వచ్చాడీసారి. ఎవడి బ్రతుకు వాడిది. ఎవడి కెవరు ఈ లోకంలో... అంతా బిజీ మనుషులు...

"నేను అడిగిందానికి జవాబు చెప్పకుండా ఇంకేమిటో ఆలోచిస్తున్నావు" భుజం తట్టింది.

"ఏమిటి నువ్వడిగింది?"

"బాగుంది నీ వరస. చాలా ప్రశ్నలడిగాను. అది సరే! నువ్వెవరో చెప్పు ముందు."

"చెబుతాను"

"సంతోషం"

"సంతోషమా? దానికీ నాకు సరిపడదు. చికాకు తెప్పించే కబుర్లు చెప్పకు."

"ఏయ్... అబద్దాలాడకు, గుర్తు తెచ్చుకో"

"ఏమిటది?"

"కొబ్బరి తోటలో చెరువు పక్క."

"ఊ... చెరువు పక్క?"

"నిమ్మచెట్టు నీడన..."

"చంపక త్వరగా చెప్పు"

"ఇంకా జ్ఞాపకం రాలేదా?"

"ఊహూ..."

"నీ మెడచుట్టూ ఆమె చేతులు. ఆమె బటక్స్ పైన నీ చేతులు..."

"అవును గుర్తొచ్చింది."

"ఈ వేళ చాలా సంతోషంగా వుందని ఆమెతో అనలేదూ?"

"అన్నాను..."

"మరిప్పుడు అబద్ధాలాడతావే?"

"ఆ ఆనందం, ఆ సంతోషం, ఎప్పుడో మట్టిలో కలిసిపోయాయి. ఆ కొద్దిపాటి ఆనందం మాత్రం ఎంతకాలం దక్కింది?"

"అది సరే. ఇంతకూ అసలు సమాధానం చెప్పనేలేదు."

"నువ్వే నన్ను తప్పుదారి పట్టిస్తూంటే ఏం చెయ్యగలను?"

"కొంపలేమీ అంటుకోలేదు. ఇప్పుడు చెప్పు?"

"నేను మనిషిని."

"అంతేనా?"

"చావటానికి సిద్ధంగా వున్న సగటు మనిషిని."

"అంత ముసలివాడివా పాపం. ఇంతకూ నీ వయస్సు ఎంతుంటుందో?"

"వంద."

"అబద్ధం."

"పోనీ అందులో సగం."

"శుక్రాచార్యుడి శిష్యుడిలా వున్నావే."

"నమ్మకపోతే మానేయ్" అన్నాడతను.

"నేనే సమాధానం చెబుతాను ఈ సారి. కాని ఇకముందు నేనడిగిందానికి నువ్వే సమాధానాలు చెప్పి, నా సంశయాలు తీర్చాలి," అంది లోపలి శక్తి.

"ఆగు, ఆగు... నీ ప్రశ్నకు సమాధానం చెబుతాను. ఇక నీ వెర్రిమొర్రి ప్రశ్నలతో నన్ను విసిగించకు."

"కానియ్."

"అరవై వుండొచ్చు"

"సరిగ్గా చెప్పు."

"చేతకాదు."

"లెక్కల్లో తొంబై మార్కులొచ్చేవిగా."

"అవి పాతరోజులు."

"నువ్వు చెప్పలేవు. నీకు చేతకాదు. ముప్పయ్యేళ్ళల్లో అరవైయేళ్ళ

కష్టాలూ, బాధలూ, ... ఇంట్లో రోగాలూ... అప్పులూ.. చేదు అనుభవాలూ నిన్ను కృశింపచేశాయి."

"నీతో వాదించటానికి నాకు తీరికలేదు."

"చిత్తు ప్రశ్నలు వెయ్యకు, అర్జెంటుగా వెళ్ళాలి" అన్నాడతను.

"ఎక్కడికి?"

"చెప్పను."

"పోనీ ఎందుకో చెప్పు."

"నీకన్నీ తెలుసు అనుకుంటాను."

"చెప్పవా?"

"ఆ మాత్రం తెలీదా? ఎవర్నో నిద్ర మాలోకం అన్నావు. కాని నిజానికి నువ్వే ఆ పేరుకు తగిందానివి."

"ఎందుకీ కష్టం?"

"కష్టంకాదు కర్తవ్యం. దీన్నే డ్యూటి అంటారు. స్కాట్ మేష్టారు చెప్పినట్టు గుర్తు."

తనకింత జ్ఞాపకమా? ఎదురుగా పది రైళ్ళు ఇరవై చేతులు అన్నీ పనిచేయలేని మొండిచేతులు... ఆరని మంటలు.

తన ఆకారాన్ని చూసి, నవ్వుతున్న కాలేజీ ఆడపిల్లలు. వాళ్ళ వెనుకనున్న కులాసా అబ్బాయిలు. జీవితం అంటే తెలియని అమాయకులు — తనూ అలానే నవ్వేవాడు ఒకప్పుడు. తనేమిటి? తన చెల్లాయి నవ్వితే ఎంతో హాయిగా వుండేది, ఇప్పుడు? ఆశలన్నీ కళ్ళల్లో ఇంకించేసుకొంది. తను ఒట్టి అసమర్థుడు...

దాహం... నీళ్ళు తాగితే బావుణ్ణు అనుకొన్నాడు.

"ఈ డ్రింక్ తీసుకో."

గంభీరమైన మామగారి కంఠం... పెళ్ళి చూపులనాడు... కళకళలాడే ముఖంతో సిగ్గుపడుతూ నవ్వితే సొట్టలుపడే ఎర్రటి గులాబి బుగ్గల్తో ఆమె... ఇప్పుడు... అతి నీరసంగా... వెలవెలబోతూ... ఐదుగురికి రూపాన్నిచ్చి... గుట్టుగా గడుపుకొస్తున్న అభాగ్యురాలు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" మామగారి ప్రశ్న.

"ఉద్యోగం అయ్యాక చేసుకుంటే బాగుంటుందని."

"ఫరవాలేదు, అన్ని ఏర్పాట్లు నేను చూసుకుంటాను. మీ నాన్నకు బాధ్యత తగ్గుతుంది."

భజంత్రీలు... చదువు పూర్తికాకుండానే ఇద్దరు బిడ్డలకు తండ్రి...

"తమ్ముడికైనా ఉద్యోగం దొరికితే బావుణ్ణు..."

"ఇంకా చాలాదూరం నడవాలి. నీ పని నడవడమే. నడుస్తూ నడుస్తూనే ఎప్పుడో గుటుక్కుమంటావ్..." అంది లోపలినేస్తం.

"నాకేం భయంలేదు" అన్నాడు.

"అంతమాట అనకు, నీ మీద ఆశలు పెట్టుకొన్నవాళ్ళ సంగతి మర్చిపోయావా? నీ ముసలితల్లి, మంచంలో మూల్గే తండ్రి ఆ మాట వింటేనే గుటుక్కుమంటారు."

ఎదురుగుండా మేడలు. దూరంగా గుడిసెలు. గుడిసెల్ని చూస్తే సింపతీ. మేడలని చూస్తే జెలసీ.

"అంత జెలసీ ఎందుకు? డబ్బు సంపాయించరాదూ."

"ఆ రాజకీయం చేతకాకనే రోజూసర్వే చెయ్యటం."

"నేర్చుకోరాదూ?"

"ఛప్ నోర్ముయ్! నీకు బుద్ధిలేదు." గాలిని తోసుకుంటూ పైకి వచ్చాయి మాటలు.

"టక్ టక్ మంటూ వేగంగా దూసుకుపోయే జట్కాలు, కార్లు. బేలన్స్‌డ్‌గా పడుతున్నాయి అడుగులు. లేకపోతే తూలిపడేటట్లున్నాడు."

"ఏమిటీ పెళ్ళి నడక. గబగబా నడువ్" తనకుతానే ఆదేశమిచ్చుకొన్నాడు.

"పాదాలునొప్పి పెడుతున్నాయి. క్రొత్త జోళ్ళు కొనుక్కోవాలి... పోనీ శనివారంనాడు ఏ గుడి బయటో..."

రోడ్డుమీద విషయాలేవీ మనస్సుకు చేరలేకపోయాయి. ఎండ తగ్గుముఖం పట్టింది. చల్లటిగాలి ముఖానికి కొట్టింది. ప్రాణానికి కొంత హాయి అనిపించింది. కాని అలసట ఏ మాత్రం తగ్గినట్టు లేదు. మెదడు ప్రశ్నించటం మానలేదు. జవాబు చెప్పకుండా దాటెయ్యాలని

అతని ప్రయత్నం...

...పాడుపడిన వీధి. వీధి చివర నిద్రగన్నేరు చెట్టు. ఆ చెట్టు వెనుక ఇల్లు, అందులో వుంటాడతను. అతను కాదంటే?

'చావు'. లోపలినుండి సలహా.

"అంత తేలిగ్గా చస్తావా? అయినా అంత పిరికివాణ్ణా నేను" ఉత్సాహంగా అన్నాడు.

"నువ్వు పెద్ద ధైర్యస్తుడివి. అది సరే! ఇంతకి నువ్వెవరో సరిగ్గా చెప్పనేలేదు."

"చెప్పను"

"నాకు తెలీదనుకుంటున్నావా?"

"తెలిస్తే ఎందుకలా నన్ను హింసిస్తున్నావ్" కోపంగా అన్నాడు.

"నీ నోటితో విందామని" మెదడు సమాధానం.

మళ్ళీ ప్రశ్న "పోనీ ఇంకెంత దూరం నడవాలో చెప్పరాదూ?"

"నేను చెప్పనన్నానుగా!"

"కోపమా."

"... ..."

"మాట్లాడవేం?"

"ఆలోచిస్తున్నాను."

"ఏమనో."

"మన మధ్య రహస్యాలేమున్నాయా అని."

"లేవు. కాని కాలక్షేపం"...

అతను విస్తుబోయాడు.

మనుషులందరూ దెయ్యాల్లా... ఇళ్ళన్నీ గోరీల్లా... రోడ్లన్నీ స్మశాన వాటికల్లా... చెత్తా చెదారం ఎముకల పోగుల్లా... తను... తను... ప్రపంచయాత్ర చేస్తున్న కాళ్ళు. కళ్ళులేని కబోదిలా... అసమర్థతకు ప్రతిరూపంగా... రోడ్డుమీద రాళ్ళు మోస్తున్న మనుషులు...

"అయితే చెబుతాను విను" అన్నాడతడు.

"చెప్పు"

"నేనెవర్ని?"

"చెబుతానని మళ్ళీ నన్నే అడుగుతున్నావా?"

"ఒంట్లో బాగోలేదు."

"ఒంట్లో బాగోలేదు."

"ఆలోచనల్లు ఎక్కువై గాబోలు పాపం."

"అవును"

"ఏమిటి?"

"మానాన్న నన్ను నడి సముద్రంలోకి తోశాడు."

"నువ్వు చేసిన నేరం ఏమిటి?"

"అతని కడుపున పుట్టటం."

"అది నువ్వు చేసిన పాపమా?"

"అతను సరదా తీర్చుకున్నాడు."

"తీర్చుకొని..."

"కన్న నేరానికి పెంచి, పెద్దచేసాననే తలగుడ్డచుట్టి బండరాయి నెత్తి మీద పెట్టాడు."

"కృతఘ్నుడిలా మాట్లాడకు."

"ఆ బండరాయి నువ్వు మోస్తే తెలుస్తుంది."

"పోనీ కిందపడేయరాదూ."

"ఆశల జిగురుతో అంటించేసాడు. దాన్ని మొయ్యటానికి ప్రయత్నించాలి. లేకపోతే నువ్వన్నట్టే కృతఘ్నుడు అంటారు జనం."

"చివరికి ఆ బండ కింద నలిగి చావాల్సిందే కాబోలు. మరి మీ వాళ్ళు నీ బరువు కొంచెం సేపు కూడా మొయ్యరా?"

"ప్రయత్నిస్తారు. కాని ఈ లోకంలో మనిషి చేసే ప్రయత్నాలన్నీ నెరవేరవు."

"ఇంతకూ అడగటం మర్చిపోయాను. అంత చెడ్డవాడా మీనాన్న."

"కాదు. నేను బాగుపడతానని వద్దన్నా పెళ్ళి చేసాడు. ఆమె కూడ ఈ రొంపిలోకి దిగింది."

"మరి మీ మామ?"

"మామలంతా మోసగాళ్ళని అల్లుళ్ళూ, అల్లుళ్ళంతా దుర్మార్గులనీ మామలూ అనుకుంటారన్న సంగతి నీకు తెలీదు కాబోలు" అన్నాడు.

"పాస్ట్ ఈజ్ పాస్ట్. భావి నీ చేతుల్లో చేతల్లో వుంది. జాగ్రత్తగా అడుగెయ్యి. ఇంతకు నువ్వెవరో తేల్చి చెప్పనేలేదు." బుఱ్ఱ మహోచురుకైన ఘటం. మళ్లీ అడిగింది.

"చెప్పక తప్పదా."

"తప్పదు."

"అయితే విను."

"తొందరగా..."

"ఎమ్మే డిస్కంటిన్యూ."

"ఇంకా?"

"ఒకప్పుడు పుస్తకాల పురుగు."

"ఇప్పుడు?"

"కాగితం మనిషి."

"అంటే?"

"బెల్ ఫుల్ ఆ బ్లిగ్"

"అంటే?"

"మోస్ట్ ఒబిడియంట్ సర్వెంట్"

"కొంచెం అర్థం అయ్యింది."

"కాదు! కాదు! కాదు!"

"మరి?"

"రివలెంట్."

"అంతేనా?"

"ప్రస్తుతానికి అంతే!"

"నీ పేరు, చరిత్ర చెప్పనేలేదు."

"నాకు అంతకంటే చరిత్రలేదు."

"పోనీ చరిత్ర సృష్టించుకోరాదూ?"

"అంత దురాశలేదు నాకు" అన్నాడతడు.

"దురాశకాదు. నేను చెప్పేది విను."

"నీకు డబ్బు కావాలి అవునా?"

"అవును. బాధలన్నీ తీరిపోతాయి."

"డబ్బున్న వాళ్ళకి బాధలులేవా?"

"వెర్రి కబుర్లు చెప్పకు."

"చెప్పేది పూర్తిగా విను."

"చెప్పు"

"లక్షాధికారి పీక నులిమేయ్. అయితే లక్షాధికారివవుతావ్. లేకపోతే..."

"అలాంటి పిచ్చి ఐడియాలిస్తావనే నువ్వంటే నాకు వళ్ళుమంట. ఈ విధంగానా చరిత్ర సృష్టించుకోవటం" అన్నాడు.

"అందుకే నువ్వొట్టి పిరికి సన్నాసి వంటాను."

"అవును."

"ఒట్టి అసమర్థుడివి!"

"అవునురా బాబూ."

"నాప"

"చిత్తం."

"ఇడియట్ వి."

"ఎగ్రీడ్" రాజీపడినట్టు పైకి వినబడిన మాట.

... పాడుపడ్డ వీధిలో నిద్రగన్నీరు చెట్టు వెనుక ఇంటిముందు నిలుచున్నాడతడు. కాబూలీవాలా తలుపునకు తాళం... తన ఆశలకు ఆశయాలకూ సంకెళ్ళలా...

"నీ బతుకు, పాపం చాలా దుర్భరంగా వుంది."

"నువ్వేమీ జాలిపడనక్కరలేదు" అన్నాడు.

"పోనీ ఒక పని చెయ్యరాదూ."

"ఏమిటో చెప్పి ఏడవరాదూ?"

"వేసెక్టమీ చెయ్యించుకోరాదూ?"

"దానితో బాధలన్నీ తీరిపోతాయా?"

"మూర్ఖుడిలా మాట్లాడకు కొంతవరకూ తీరవచ్చు."

"... ..."

"మాట్లాడవే."

"భయమేస్తుంది."

"ఎందుకు."

"మాట్లాడ్డానికి" అన్నాడు.

"ఏం."

"ఎదురుగా ఎవరో నిలబడ్డారు."

"ఎవరు దేవుడా?"

"కాదు."

"అవును దేవుడే. దేవుణ్ణి చూసి భయపడుతున్నావు. అవునా?" అంది మెదడు.

"నాకు భయం లేదు. దేవుడు లేదు. ఒక వేళ వున్నా నా బాధల్ని తీర్చలేడు."

"మరెవరు!"

"వసంత మేఘాలు గర్జించాలి, కొత్త పంట రావాలి"

"నువ్వేం చేస్తున్నట్టు?"

"సగం చచ్చిన వాణ్ణి నన్ను విసిగించకు,"

"ఇంతకూ నీ ముందు నిలబడ్డ వారెవరు?"

"నా నీడ."

"అంతేనా?"

"అంతే!"

"నేను – ఇందాక చెప్పిన సంగతి ఏం చేశావు?"

"ఏ సంగతి!"

"అప్పుడే మరిచావా? బర్త్ కంట్రోల్ సంగతి."

"చూద్దాం?"

"నీలాంటి బడుద్దాయిలున్నారు కనుకే, దేశం ఇలా తగలబడింది."

"దేశంలోని సమస్యలన్నింటికీ నేను కారకుణ్ణా? నేరం నా మీద వేయకు."

"బదుద్దాయీ... డబ్బులొచ్చే వుపాయం చెప్పాను. తరువాత నీ యిష్టం."

"నిజం చెప్పమంటావా?"

"చెప్పు."

"అసలు నాకు పెళ్ళే కాలేదు."

"అబద్ధాలాడకు. ఆడపిల్లలు పుడతారు,"

"నాకు మతిమరుపు ఎక్కువ"

"జ్ఞాపకం తెచ్చుకో... భార్య ఐదుగురు పిల్లలుగాక..."

"జ్ఞాపకం వచ్చింది. నిజంగా నాకు మతిపోయినట్టుంది," అన్నాడు.

"మతివుండగానే ఇల్లు చక్కబెట్టు."

"అసలు రహస్యం చెబుతాను విను"

"అంత రహస్యమా?"

"డబ్బు అవసరమై ఆపరేషను ఎప్పుడో చేయించేసుకున్నాను," అన్నాడు.

"నీ మాటలు నమ్మలేకుండా వున్నాను."

"నమ్ము. నీ మీద ఒట్టు."

"నా మీదే వేస్తున్నావా ఒట్టు"

"పోనీ ఆ దీపం మీద ఒట్టు" అన్నాడు.

"ఎందుకు ఒణుకుతున్నావు?"

"దీపాలంటే భయం నాకు,"

"ఎందుకని?"

"దీపాలకు నూనె పొయ్యలేక, మా యింటి దీపాలన్నీ బలవంతంగా వూదేసాను."

"నీ దీపాన్ని మాత్రం వెలగనిచ్చావు."

"కాదు కాదు. నా ప్రయత్నంలో నేనుండగా పోలీసులు పట్టుకున్నారు."

"తర్వాత"

"జ్ఞాపకం లేదు."

"జ్ఞాపకం తెచ్చుకో."

"నా మెదడుకు జబ్బు చేసిందన్నారు"

"నాకా?" అంది మెదడు.

"అవును నీకే" అన్నాడు.

"తరువాత ఏం జరిగింది?"

"ఆసుపత్రిలోంచి పారిపోయి వచ్చాను,"

"మళ్ళీ ఎవరూ నిన్ను పట్టుకోలేదా?"

"నేను ఇండిపెండెంట్‌ను."

అతను పక్క రోడ్డుకు మళ్ళాడు, కడుపు కరకరలాడుతున్నది. చీకటి పడుతూ వుంది. దూరంగా పెద్ద మేడ. మేడలో హోటల్.

"ఎక్కడికి నీ ప్రయాణం" అంది బుర్ర.

"ఒకరి కోసం అన్వేషిస్తున్నాను." అన్నాడతడు.

"ఎవరో అతను?"

"పరబ్రహ్మను"

"సోల్ ఆఫ్టర్ డెత్ జీర్ణించుకుంటున్నావన్న మాట."

"వాలు కుర్చీ వేదాంతం, నాకెందుకు?"

"నీది నోరా, తాటిపట్టా? ఇందాక పరబ్రహ్మను అన్వేషిస్తున్నానన్నావు,"

"అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్న మాట వినలేదా?"

"అర్థమయింది"

"హోటలుకా?"

"అంత అదృష్టమా?"

"మరి?"

"చూస్తావుగా?"

...హోటలు ఎదురుగా తొట్టి. తొట్టి పక్క, లోపల ఎంగిలాకుల కట్టలు... వాటి కోసం పోటి పడుతున్న కుక్కలూ...

పందులూ... బజారు బిడ్డలూ... మెదడు కంటికి కనిపించాయి.